దద్దనాల దుస్థితి మారదా..?

బనగానపల్లె, మే 24: బనగానపల్లె నియోజకవర్గంలోని ఒకే ఒక మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు దద్దనాల ప్రాజెక్టు. దీని కింద ప్రత్యక్షంగా 1516 ఎకరాలకు పరోక్షంగా పదివేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. 15 గ్రామాలకు ఈ ప్రాజెక్టు ద్వారా తాగునీరు అందుతోంది. గతంలో ప్రాజెక్టులోకి నీరురాక ఒట్టిపోయింది. 14ఏళ్లుగా ప్రధాన గేట్లు, పూడిక గేట్లు మరమ్మతులకు నోచుకోలేదు. అయితే ఇందులో ఓ గేటు మరమ్మతు చేశారు. ప్రాజెక్టు మరో ప్రధాన గేటు ఒకటి, రెండుపూడిక గేట్లు, పంటపొలాలకు నీటిని వదిలే స్లూయిస్ గేట్లు పదేళ్లగా మరమ్మతులకు నోచుకోలేదు.



దద్దనాల ప్రాజెక్టు

దెబ్బతిన్న పంటకాల్వలు, ప్రాజెక్టు ఫ్లాట్ ఫాం

గత 14ఏళ్లుగా ఒక ప్రధాన గేటు, పూడిక గేట్లు, పంటకాల్వలు దెబ్బతిన్నాయి. పంట కాల్వలు ముళ్ల కంపలతో నిండిపోయాయి. ప్రాజెక్టుకు సంబంధించిన ప్లాట్‌ఫారం కనీస మరమ్మతులకు నో చుకోలేదు. కనీసం పంటలు పండించుకుందామన్నా పంటకాల్వలు లేక రైతులు బోర్లు వేసుకొని వ్యవసాయం చేసుకుంటున్నారు. అధికారికంగా సుమారు 1516 ఎకరాలకు పంటకాల్వలు లేవు. ఉన్నవి శిథిలమయ్యాయి. పంటకాల్వలు ముళ్ల కంపలతో నిండి పోయాయి.


- 14 ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని ప్రధాన గేట్లు, పూడిక గేట్లు
- 10 అడుగులకు చేరిన పూడిక
- రూ.2 కోట్లతో ప్రాజెక్టు ఆధునికీకరణకు ప్రతిపాదనలు
- కూటమి ప్రభుత్వంపైనే అన్నదాతల ఆశలు

దద్దనాల ప్రాజెక్టు

దద్దనాల ప్రాజెక్టును బనగానపల్లె మండలం పాతపాడు గ్రామ సమీపంలో రెండు ఎరమల్ల కొండల మధ్య నిర్మించారు. 150 ఎకరాల విస్తీర్ణంలో 0.02 టీఎంసీల నీటి నిల్వ చేసే విధంగా ప్రాజెక్టును నిర్మించారు. 1516 ఎకరాలకు ప్రత్యక్షంగా సాగునీరు, 15 గ్రామాలకు తాగునీరు సమస్య శాశ్వతంగా తీర్చిదిద్దే విధంగా ఈ ప్రాజెక్టును నిర్మించారు. 12 ఏళ్లుగా వర్షాభావ పరిస్థితుల వలన దద్దనాల ప్రాజెక్టు ఓటికుండలా మారిపోయింది. ఏనాడూ ఈ ప్రాజెక్టు నిండిన దాఖలాలు లేవు. దీనికి తోడు ప్యాపిలి మండలం జలదుర్గం వద్ద కొండలపై వచ్చే వర్షపునీటికి అడ్డుకట్ట వేస్తూ పెద్ద చెక్‌డ్యాంను నిర్మించారు. అప్పట్నుంచి వర్షపునీరు ఆ చెక్‌డ్యాంలోని వెళ్లిపోతుండడంతో దద్దనాల ప్రాజెక్టుకు నీరు అందే పరిస్థితి లేపోయింది. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఎస్సార్బీసీ కాలువ నుంచి ఎత్తిపోతల పథకం మంజూరు చేయించి పనులు పూర్తి చేయడంతో గత 6ఏళ్ల నుంచి ప్రాజెక్టు నిండుకుండలా ఉంది.

14 ఏళ్లుగా మరమ్మతులకు..

దద్దనాల ప్రాజెక్టుకు గతంలో వర్షపు నీరు సరిగ్గా రాకపోవడం, ప్రాజెక్టు నిండకపోవడంతో మైనర్ ఇరిగేషన్ అధికారులు ఈ ప్రాజెక్టుకు మరమ్మతులు చేయడం మానేశారు. 14 ఏళ్ళగా ఒక ప్రధాన గేటు, పూడిక గేట్లు, పంట పొలాలకు నీరు అందించే స్లూయిస్ గేట్లు పూర్తిగా పనిచేయడం లేదు. గత నాలుగేళ్ల క్రితం ప్రధాన గేట్లకు మరమ్మతులు చేయడానికి ప్రయత్నించినా ఒక గేటు మాత్రమే మరమ్మతులకు నోచుకుంది. ఒక్క గేటు మాత్రం నేటికీ మరమ్మతులకు నోచుకోలేదు. అలాగే పూడికగేట్లు, స్లూయిస్ గేట్లు కూడా మరమ్మతులకు నోచుకోలేదు. ప్రాజెక్టులో నీరు రాకపోవడంతో 10 అడుగులకు పైగా లోతు పూడికతో నిండిపోయింది.



ప్రాజెక్టులో నిలిచిన నీరు

ప్రాజెక్టు ఆధునికీకరణ కోసం రూ.2 కోట్లతో ప్రతిపాదనలు

దద్దనాల ప్రాజెక్టు గేట్లు, పూడికగేట్లు, ప్లాట్‌ఫారం, కాల్వల నిర్మాణం, లైనింగ్, శిథిలావస్థకు చేరుకున్న కాల్వల మరమ్మతులు జనరేటర్ ఇతర పనులకు రూ.2 కోట్లతో పూర్తి స్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ప్రాజెక్టు కోసం



మరమ్మతులకు నోచుకోని గేటు

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా నిధులు మంజూరైన వెంటనే దద్దనాల ప్రాజెక్టు పనులు పూర్తి చేసి ఆధునికీకరించడానికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహకారంతో నిధుల మంజూరుకు కృషి చేస్తున్నాం.

\- రామ్మోహన్‌రెడ్డి, ఏఈ, మైనర్ ఇరిగేషన్

నేడు ఉమ్మడి జిల్లాలో ఓ మోస్తరు వర్షం

నంద్యాల ఎడ్యుకేషన్, మే 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాలో నేడు ఉరుములు, పిడుగులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ శనివారం వెల్లడించింది. 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో పిడుగులు పడే అవకాశముందని, అనేక ప్రదేశాల్లో 15.6ఎంఎం నుంచి 64.4 ఎంఎం వర్షం పడే సూచనలున్నాయని తెలిపారు. అందులో ప్రధానంగా కర్నూలు జిల్లాలో ఆదోని, ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద, కోసిగి, కౌతాళం, మద్దికెర, మంత్రాలయం, పత్తికొండ, పెద్దకడుబూరు, తుగ్గలి మండలాల్లో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. అలాగే నంద్యాల జిల్లాలో డోన్, ప్యాపిలి తదితర మండలాల్లో కూడా వర్షాలు కురుస్తాయని తెలిపారు.

పది సప్లిమెంటరీకి 622 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, మే 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో శనివారం నిర్వహించిన పదో తరగతి జీవశాస్త్రం సప్లిమెంటరీ పరీక్షకు 622 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. డీఈవో మాట్లాడుతూ 35 పరీక్షా కేంద్రాల్లో జరిగిన జీవశాస్త్రం పరీక్షకు 2624 మంది విద్యార్థులకు గాను 2002 మంది హాజరయ్యారని, 622 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 5 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. అలాగే సార్వత్రిక విద్యాపీఠం పరీక్షల్లో(ఓపన్ స్కూల్ పరీక్షలు)భాగంగా 4 కేంద్రాల్లో నిర్వహించిన సాంఘికశాస్త్రం, ఆర్థికశాస్త్రం పరీక్షకు 114 మంది విద్యార్థులకు గాను 95మంది హాజరు కాగా 19 మంది గైర్హాజరైనట్లు వివరించారు. ఇంటర్ పరీక్షల్లో భాగంగా జీవశాస్త్రం, వాణిజ్య, గృహ విజ్ఞానశాస్త్రం పరీక్షను రెండు కేంద్రాల్లో నిర్వహించగా 123 మంది విద్యార్థులకు గాను 107 మంది విద్యార్థులు హాజరయ్యారని, 16 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు: ఎస్పీ

నంద్యాల టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక అనివార్య కారణాల వల్ల రద్దు చేస్తున్నట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నలుమూలల నుంచే ఫిర్యాదుదారులు గమనించి రావద్దని సూచించారు. జూన్ 2న ఈ కార్యక్రమం యాథావిధిగా ఉంటుందని పేర్కొన్నారు.

నాగవైష్ణవిజయం

- పోరాడి గెలచిన పేదింటి సరస్వతీ పుత్రిక
- గణితంలో రీవెరిఫికేషన్ ● ఏకంగా పెరిగిన 15 మార్కులు ● అవుకు మండల టాపర్‌గా నాగవైష్ణవి
- అభినందించిన ఉపాధ్యాయులు

7

బహిరంగ మల విసర్జన రహిత జిల్లాగా తీర్చిదిద్దండి: కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, మే 24(ఆంధ్రజ్యోతి): జిల్లాను బహిరంగ మల విసర్జన రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలు, పారిశుధ్యంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓడీఎఫ్ ప్లస్ కింద చేపట్టి పెండింగ్‌లో ఉన్న 62గ్రామాలను బహిరంగ మలవిసర్జన లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగంపై సర్వే చేసి వాటి వినియోగానికి చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ట్యాంకుల పరిశుభ్రత, క్లోరినేషన్ చేసిన తాగునీటి సరఫరా, చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలపై సమీక్షించి ఎప్పటికప్పుడు పీఆర్-1యాప్‌లో నమోదు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతినెలా 3వ శనివారం చేపట్టే స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములు చేయాలని, పరిశుభ్రత కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, డీపీవో శివారెడ్డి, డీపీఆర్సీ కోఆర్డినేటర్ మంజులవాణి తదితరులు పాల్గొన్నారు.

- జిల్లాలో గిరిజనులకు దర్తి అభజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ -2025 పథకాన్ని పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ గిరిజనులకు అందేవిధంగా ఆయాశాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. జూన్ 15నుంచి 30వరకు జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

యువ డ్రంకర్లు...

- పెరుగుతున్న నేర సంస్కృతి
- మద్యం తాగి వాహనాలు నడుపుతున్న యువత
- ఒకే రోజు 100మంది కోర్టులో హాజరు
- స్పెషల్ డ్రైవ్‌లో బయట పడుతున్న నేర చరిత్ర
- ఈ ఏడాది ఏప్రిల్ వరకు 1271 కేసులు

నంద్యాల టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): పెద్దలు, పిల్లలు అంతా స్మార్ట్ ఫోన్లకు అలవాటు పడ్డారు. ఇందులో యువత మరి విపరీతంగా వాడి చెడు దోవ పడుతున్నారు. స్పోర్ట్స్ బైకులు తీసుకుని మితిమీరిన వేగంతో దూసుకెళ్తున్నారు. తల్లిదండ్రులు వేల రూపాయలు ఖర్చులకు ఇవ్వడంతో వారు జల్సాలకు, వ్యసనాలకు బానిసలవుతున్నారు. గొడవలు, ఘర్షణలు చేసి చివరకు నేరాలు చేయడానికి కూడా వెనుకాడడం లేదు.

పిల్లలపై నిఘా ఏదీ..

పిల్లలపై ఉన్న ప్రేమ, మమకారంతో వారు అడిగినంత డబ్బులు ఇస్తున్న కన్నవారు వారిపై కన్నేసి ఉంచాలి. పిల్లలు ఏం చేస్తున్నదీ ఆరాతీయాలి. పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులు దృష్టి పెట్టకపోతే నష్టపోతారు. వీలైనంత వరకు ఫోన్లకు దూరంగా ఉంచాలి. ఏవైనా లోపాలు ఉంటే విద్యా సంస్థల యాజమాన్యాలకు ఫిర్యాదు చేయాలి.

బీరు తాగితే ఏం కాదనేది అపోహ మాత్రమే ..!

సాధారణంగా డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పోలీసులు చెక్ చేసే మిషన్లు 30శాతం కంటే తక్కువగా వస్తే ఎటువంటి కేసు నమోదు కాదు. కానీ బీరులో అల్కాహాల్ శాతం తక్కువగా ఉంటుందని తాగి రోడ్డుపై తిరుగుతూ పోలీసులకు చిక్కుతున్నారు. వారి తల్లిదండ్రులను పిలిపించి కోర్టులో ఫైన్లు కట్టి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటికి పంపుతున్నారు. అయినా పిల్లల్లో మార్పు రావడం లేదు. ఇదిలా ఉంటే శని, ఆదివారాల్లో యువత మరింత ఎక్కువగా డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడుతున్నారు.



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఒకే రోజు కోర్టుకు 100 మంది కోర్టు

నంద్యాల జిల్లాలో గత నెల రోజుల నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. అయితే ఇటీవల ప్రతి రోజు సుమారుగా 70 నుంచి 90 కేసులు కేవలం మద్యపానం కేసులు నమోదు అవుతున్నాయి. వీటిలో ఎక్కువగా 80 శాతం మంది యువత ఉంటున్నారు. వీరు ఇలా ఉంటే తాగిన మైకంలో నేరాలు చేయడానికి పూర్తి అవకాశం ఉంది. ఇదంతా చేస్తున్న ఫైన్లు కట్టాలి, జైలుకు వెళ్తారు అన్నా భయం లేకుండా పోయింది. అయితే ఇటీవల కోర్టుకు ఫైన్లు కట్టడానికి ఏకంగా 100 మంది ఒకే రోజు రావడంతో జడ్జి సైతం ఆశ్చర్యపోయారు. మరోసారి మద్యం తాగి బండి నడిపితే ఏకంగా రూ. 10 వేలు జరిమానా వేయాలని చెప్పినట్లు సమాచారం.

కేసులు
2024లో...3879
2025లో...2171

- ఇటీవల నంద్యాలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా యువకుల నుంచి పిడిబాకులు బయట పడ్డాయి.
- దేవనగర్, రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో యువత ఎక్కువగా అల్లర్లకు పాల్పడుతున్నారు. అయినా పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.
- ఎన్జీవో కాలనీ, గోపాల్ నగర్, పద్మావతి నగర్ వంటి ప్రాంతాల్లో రాత్రి సమయంలో సరియైన గస్తీ లేక అల్లర్లు జరుగుతున్నాయి.
- బొమ్మలసత్రం విశ్వనగర్, ఎన్జీవో కాలనీల్లో యువత ఎక్కువగా బెట్టింగులకు పాల్పడుతున్నారు. పోలీసులకు తెలిసిన పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి.



వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు



తల్లిదండ్రులు బాధ్యత వహించాలి

పిల్లలు ఎక్కడ తిరుగుతున్నారు.. ఏం చేస్తున్నారు.. అనే విషయంలో తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలి. పదే పదే తాగి వాహనం నడిపి పట్టుబడితే బైకులను సీజ్ చేస్తాం. పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నడపాలి. యువత తప్పుదోవ పట్టకుండా తగిన చర్యలు వారి తల్లిదండ్రులు తీసుకోవాలి.

\- అధిరాజ్ సింగ్ రాణా, ఎస్పీ నంద్యాల

డ్రాగన్ బోట్

- కర్నూలులో కేరళ సంప్రదాయ క్రీడ
- గార్గేయపురం చెరువులో ట్రైనింగ్
- కొత్త క్రీడపై సర్వత్రా ఆసక్తి



కర్నూలు, మే 24 (ఆంధ్రజ్యోతి : సాధారణంగా పడవ పోటీలు అంటే ఎక్కువగా కేరళ, తమిళనాడులో చూస్తుంటాం. కానీ ఏషియన్ గేమ్స్‌లో ఉన్న పోటీల్లో డ్రాగన్ బోట్ పోటీలు కూడా ఒకటి. మన దేశంలో కేరళ రాష్ట్ర సంప్రదాయ క్రీడగా కేరళలోని చిన్న చిన్న కాల్వగట్లలో చెరువులు, అక్కడి పరిసరాల్లో ప్రవహించే నదుల్లో ఈ పడవ పోటీలను నిర్వహిస్తుంటారు. వాటిని మనం సినిమాల్లోనే చూస్తుంటాం. కానీ అదికూడా ఒక టోర్నమెంట్ అని, ఏషియన్ గేమ్స్‌లో ఒక భాగమని చాలా కొద్దిమందికే అవగాహన ఉంది. అలాంటి పోటీలను చైనా, జపాన్, టోక్యో వంటి నగరాల్లో నిర్వహించే బోటింగ్ పోటీలను డ్రాగన్ బోట్ పోటీలు అంటారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన డ్రాగన్ బోట్ పోటీల్లో సత్తా చాటేందుకు కర్నూలు జిల్లా క్రీడాకారులు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో తిరుపతి, విజయవాడ, ఏలూరు ప్రాంతాల్లో మాత్రమే ఈ డ్రాగన్ బోట్ పోటీలకు సంబంధించిన శిక్షణ ఇస్తున్న నేపథ్యంలో కర్నూలు జిల్లాకు చెందిన కొంతమంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేందుకు సిద్ధమయ్యారు. డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో కర్నూలు శివారులోని గార్గేయపురం చెరువులో డ్రాగన్ బోట్‌పై శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్ర డ్రాగన్ బోట్ అసోసియేషన్ సెక్రెటరీ అవినాష్ శెటగ్గి రూ.3లక్షలు విలువ చేసే డ్రాగన్ బోట్‌ను ఏర్పాటు చేశారు. అందోల 10 ప్లస్ 2 పద్ధతిలో క్రీడాకారులు పాల్గొని శిక్షణ పొందుతున్నారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన కానిస్టేబుల్ చంద్రశేఖర్‌ను అటాచ్‌మెంట్ పద్ధతిలో శిక్షణ ఇప్పించేందుకు ప్రత్యేకంగా నియమించారు. ప్రస్తుతం శిక్షకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దాదాపు 14 నుంచి 18 మంది విద్యార్థులు గార్గేయపురం చెరువులో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఒక బోట్‌తోనే శిక్షణ ఇస్తున్నారు. మరో బోట్‌ను కూడా కేటాయిస్తే మెరుగైన శిక్షణ ఇవ్వగలమని ట్రైనర్ చంద్రశేఖర్ ఆశాభావం వ్యక్తం చేశారు.



గార్గేయపురం చెరువులో డ్రాగన్ బోట్ క్రీడాశిక్షణ



రేషన్ కార్డు విభజనలో కొర్రీలు

● కొత్త జంటలకు తప్పని అవస్థలు
● దిక్కుతోచని స్థితిలో బాధితులు
● ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోని వైనం

ఆత్మకూరు, మే 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎట్టకేలకు రేషన్ కార్డుల మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పౌరసరఫరాల శాఖ ద్వారా ఈ నెల 7వ తేది నుంచి రేషన్ కార్డుల విషయంలో పలు సేవలను పొందేందుకు వెసులుబాటు కల్పించింది. ఇందులో ప్రత్యేకించి కొత్తగా రేషన్ కార్డు, అదనంగా కుటుంబ సభ్యుల జోడింపు, రేషన్ కార్డు విభజన, రేషన్ కార్డు రద్దు, రేషన్ కార్డులో చిరునామ మార్పు, రేషన్ కార్డులో ఆధార్ నంబర్ సీడింగ్ దిద్దుబాటు చేయడం వంటి సేవలకు అవకాశం ఇచ్చింది. ఇంతవరకు అంతా బాగానే ఉన్నప్పటికీ తండ్రి మరణించి తల్లితో మాత్రమే కలిసి ఉండే కుటుంబాల్లో కుమారుడికి వివాహమైనట్లయితే అలాంటి నూతన జంటలకు కొత్త రేషన్ కార్డు జారీ విషయంలో కొర్రీలు విధించారు. తల్లి ఒక్కరినే వదిలి పెళ్లయిన నూతన జంటకు కొత్త రేషన్ ఇచ్చేందుకు గత వైసీపీ ప్రభుత్వం నుంచి అవకాశం లేకుండా చేసింది. దీంతో తప్పని పరిస్థితుల్లో కొత్త జంట తల్లి రేషన్ కార్డులోనే కొనసాగాల్సిన పరిస్థితి వస్తోంది. అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల కారణంగా ఈ విధానం వల్ల ఎంతో మంది బాధితులకు నష్టం జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం క్షేత్రస్థాయి సమస్యలను పరిగణన లోకి తీసుకోకుండా మొండిగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

రేషన్‌కార్డు విభజనలో కొత్త జంటలకు తప్పని అవస్థలు

ప్రభుత్వం ప్రస్తుతం విధించిన నిబంధనల వల్ల తల్లితో కలిసి రేషన్


రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

కార్డులో కొనసాగుతున్న కుమారుడికి వివాహం జరిగినట్లయితే ఆ నూతన జంటకు కొత్త రేషన్ కార్డు మంజూరయ్యే అవకాశం లేకుండా పోయింది. ఒకవేళ తల్లి రేషన్ కార్డు నెంబర్ ద్వారానే గతంలో ఇంటిపట్టా, గృహనిర్మాణ పథకం వర్తిస్తే మళ్లీ అదే రేషన్ కార్డు పేరిట రాదు. అదేక్రమంలో తల్లిదండ్రులు ఉన్నప్పుడు మంజూరైన ఇంటి స్థలం, గృహాన్ని ఇతరులకు విక్రయించినా, లేదా ఆ పథకాలను ఇంట్లోని మిగతా కుమారులు, ఇతర ఎవరైనా పొందినా కూడా ప్రస్తుతం ఉంటున్న కొత్త జంటకు ఈ పథకాలు వర్తించని పరిస్థితులు ఉన్నాయి. ఈ సమస్య ఒక్క ఆత్మకూరు పట్టణంలోనే అనేకమంది యవకులు ఎదుర్కొంటున్న పరిష్కారం దిశగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. తల్లి ఒక్కరి పేరిట రేషన్ కార్డు ఇవ్వడం కుదరని, ఆ రేషన్ కార్డులోనే కొడుకు, కోడలు, వారికి సంతాపనం ఉన్నట్లయితే వారందరు జోడింపు చేసుకోవాలే తప్ప కొత్త రేషన్ కార్డు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెబుతున్నారు. దీనివల్ల నూతన జంటకు ఇళ్లపట్టా, గృహనిర్మాణం వంటి ప్రధాన సంక్షేమ పథకాలు అందని ద్రాక్షగా మారనున్నాయి. దీంతో ఎంతో మంది పెళ్లయినా జంటలకు నిరాశే మిగిలింది. గత నాలుగైదేళ్లుగా ఈ పరిస్థితి ఇలానే ఉండటంతో ఎంతో మంది బాధితులు నిరుత్సాహానికి లోనవుతున్నారు.

సమస్యను ఉన్నతాధికారులకు వివరిస్తాం

తల్లి కలిసి రేషన్ కార్డులో కొనసాగుతున్న కొడుకు, కోడలు ప్రత్యేక రేషన్ కార్డులు పొందే దరఖాస్తులు ఇప్పటికే చాలా వచ్చాయి. నిబంధనల ప్రకారం తల్లితో రేషన్‌కార్డులో కలిసి ఉండే కొడుకు, కోడలుకు ప్రత్యేకంగా రేషన్ కార్డులు మంజూరు చేసేందుకు అవకాశం లేదు. దీనివల్ల కొంత మంది బాధితులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు మా దృష్టికి వచ్చాయి. ఈ విషయాన్ని జిల్లా అధికారులకు వివరించి సమస్య పరిష్కారానికి మావంతుగా ప్రయత్నిస్తాం.

- శ్రీనివాసులు, సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్, ఆత్మకూరు

నందికొట్కూరులో ఉల్లి కొనుగోలుకు కృషి

● ఎమ్మెల్యే గిత్తా జయసూర్య


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఉల్లి పంటను రైతులు అధికంగా సాగు చేస్తున్నారని, ఆ దిగుబడులను నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ యార్డులోనే కొనుగోలు చేసే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన చైర్మన్‌గా ఎన్నికైన వీరం ప్రసాద్‌రెడ్డికి శనివారం జాయినింగ్ ఆర్డర్‌ను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఉల్లి రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి వెస్ట్ గోదావరి గూడెం, కర్నూలు మార్కెట్ యార్డులకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. మార్క్‌ఫెడ్ అధికారులతో మాట్లాడి నందికొట్కూరు మార్కెట్ యార్డులో ఉల్లి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. నందికొట్కూరు మార్కెట్ యార్డు సంవత్సర రూ.3.60 కోట్లు ఆదాయం ఉందని, రెట్టింపు ఆదాయం వచ్చేలా పాలకవర్గం చర్యలు తీసుకోవాలని ఆయన నూతన కమిటీని సూచించారు. మార్కెట్ యార్డులో ఉన్న సిబ్బంది కొరతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. వీరం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాల్టీ అధికారులు, నాయకులు, ఇటు ఇతర శాఖల అధికారులు తనకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, 2వ వార్డు కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్, టీడీపీ నాయకులు షకీల్ అహ్మద్, పలుచాని మహేశ్వర్‌రెడ్డి, బ్రహ్మయ్య ఆచారి, వ్యవసాయ మార్కెట్ యార్డు అధికారి రాము, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు కౌలు వేలం

బండిఆత్మకూ మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ దేవస్థానాలకు సంబంధించిన ఆలయ భూములకు కౌలు వేలం పాటలు పోటాపోటీగా సాగాయి. శనివారం సాయంత్రం బి.కోడూరు చెన్నకేశవ స్వామికి చెందిన 20.98 ఎకరాల భూములకు గత ఏడాది రూ.5,34,000 రాగా ఈ ఏడాది రూ.5,60,000 లభించిందని, గతంకన్నా రూ.26 వేలు అదనం వేలం లభించిందని ఈవో నాగప్రసాద్ తెలిపారు. బండి ఆత్మకూరు జనార్దనస్వామికి చెందిన 37.14 ఎకరాల భూములకు వేలం నిర్వహించగా 19.84 ఎకరాల భూమికి వేలం పాటలు రూ.4,43,000 లభించిందన్నారు. మిగిలిన 17.30 ఎకరాలకు సరైన వేలం పాట రాకపోవడంతో వేలాలు నిలిపివేశామని ఈవో తెలిపారు. మండలంలోని పార్నపల్లె గ్రామంలోని వీరభద్ర, అంజనేయ, వేణుగోపాల స్వామి ఆలయాల, కౌకుంట్ల లక్ష్మయ్య, గంధ్రకోట సుబ్బమ్మ అన్నదాన సత్రానికి చెందిన సుమారు 90 ఎకరాల భూములకు గత ఏడాది రూ.31,07,000 రాగా ఈ ఏడాది రూ. 31,63,000 లభించిందని గత ఏడాది కన్నా రూ.56,000 ఎక్కువగా ఆదాయం వచ్చిందని ఆయా ఆలయాల ఈవో మోహన్ తెలిపారు. ఈ వేలం పాటలకు పర్యవేక్షణాధికారులుగా హరిశ్చంద్రారెడ్డి, గోపి హాజరయ్యారు.

నంద్యాల రూరల్: నంద్యాల మండలంలోని కొత్తపల్లి గ్రామంలో వెలిసిన శ్రీరామస్వామి చెందిన భూములకు నిర్వహించిన కౌలు వేలంలో రూ3.20 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈవో వేణునాథరెడ్డి తెలిపారు. శనివారం గ్రామంలో 21. ఎకరాలకు బహిరంగ కౌలువేలం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంవత్సర కాలపరిమితితో 8 మంది రైతులు వేలంలో సాగు హక్కులు దక్కించుకున్నారన్నారు. రూరల్ ఎస్ఐ గంగయ్య బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రైతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

వెలుగోడు, మే 24 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు పట్టణంలో ఉపాధి హామి పథకంలో మేటిగా పనిచేస్తున్న భాస్కర్‌కు విష పురుగు కుట్టి అనారోగ్యం పాలయ్యాడు. ఈ మేరకు విషయం తెలుసుకొన్న సహచర మేటీలు తలా ఇంత వేసుకొని రూ.5 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని శనివారం వెలుగోడు మండల జనసేన నాయకులు శాలుబాషా చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మేటీల అధ్యక్షుడు నూరుల్లా, ప్రతాప్, జయలలిత, ప్రసన్న తదితదరులు పాల్గొన్నారు.

పెంచిన ఇంటి పన్నును వెంటనే ఉపసంహరించుకోవాలి



ఆత్మకూరులో ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): పెంచిన ఇంటి పన్నును వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 20 శాతం ఇంటి పన్నులను పెంచుతూ రీ సర్వే చేయించిరూ.463 కోట్లు ప్రజలపై అదనంగా భారం వేసేందుకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు పక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ, ఉస్మాన్ బాషా పాల్గొన్నారు.

ఆత్మకూరు: మున్సిపాలిటీల పరిధిలో పెంచిన ఆస్తి పన్ను తగ్గించాలని సీపీఎం నాయకుడు రణధీర్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట పెంచిన ఆస్తి పన్ను ప్రతులను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇప్పటికే మున్సిపాలిటీల్లో 15శాతం పన్నుల భారాన్ని పెంచి అదనంగా మరో 20శాతం పెంచడం అన్యాయమని అన్నారు. 2021-21 సంవత్సరంతో పోల్చితే 30శాతం ప్రజలపై అదనపు పన్నుల భారం పడనుందని చెప్పారు. ఎన్నికల ముందు పన్నులను పెంచమని చెప్పిన కూటమి పాలకులు నేడు అధికారంలోకి వచ్చా ప్రజలపై భారీగా పన్నుల భారం మోపడం దారుణమన్నారు. దీనివల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాయకులు వీరన్న, శివకుమార్, మల్లయ్య, నాగేశ్వరరావు, రవి, విజయ్, వలి ఉన్నారు.



నందికొట్కూరులో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


విద్యార్థినికి పురస్కారం అందజేస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, మే 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్పీజీ ఉన్నత పాఠశాలలో మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పది, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పురస్కారాలు అందజేశారు. మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సుబ్బన్న, ప్రధాన కార్యదర్శి రవికుమార్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి డీఈవో జనార్దన్‌రెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకులు చింతామణి, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి లక్కభూషణం, ఎస్పీజీ హైస్కూల్ హెచ్ఎం జీవలత, మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ కిశోర్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై 30మంది విద్యార్థులకు పురస్కారాలు అందజేసి అభినందించారు. వారు మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి విద్య ద్వారానే విలువ లభిస్తుందని, వివేకాన్ని పెంచుతుందన్నారు. విద్య వల్ల కులమతాలకు అతీతంగా గౌరవాన్ని పొందవచ్చన్నారు. విద్యార్థులు తమ లక్ష్యసాధనకు తగిన ప్రణాళికలను సిద్ధం చేసుకుని ముందుకు నడవాలన్నారు. ఓటమి చెందినప్పుడు కుంగిపోకుండా మానసిక స్థైర్యంతో ముందుకు సాగలన్నారు. కార్యక్రమంలో సుజిత్ ఆనంద్‌సు కుమార్, మద్దయ్య, వెంకటేశ్వర్లు, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి జాకీర్ హుస్సేన్

మిడుతూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని, యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మండల ప్రత్యేక అధికారి జాకీర్ హుస్సేన్ అన్నారు. శనివారం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో యోగాంధ్రపై ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో దశరథరామయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల ప్రత్యేక అధికారి జాకీర్ హుశేన్ హాజరై మాట్లాడారు. ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు అంతర్జాతీయ యోగా దినో త్సవం సందర్భంగా మాసోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మండలంలో యోగాపై ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈవోఆర్డీ సంజన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తే చర్యలు'

కొత్తపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తే సంబంధిత షాపులను సీజ్ చేయడమే కాకుండా మద్యం షాపుల యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామని ఆత్మకూరు ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్ హెచ్చరించారు. శనివారం కొత్తపల్లిలోని ఎస్‌వీ వైన్స్, పల్లవి గౌడ్స్ వైన్స్ షాపులను ఎక్సైజ్ సీఐ కిషోర్ కుమార్, ఎస్ఐలు జగదీష్, వీరస్వాములతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం సీఐ విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. కొత్తపల్లి మండలంలో వివిధ గ్రామాల్లో అక్రమంగా బెల్టు షాపులు నిర్వహిస్తున్న 20 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 233 క్వాటర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అలాగే వీరాపురం గ్రామంలో మద్యం విక్రయిస్తున్న తలారి సుంకన్న, షేకావత్ నాగాబాయిలపై కేసు నమోదు చేసి వారి వద్దనున్న 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసకున్నామని సీఐ తెలిపారు. ఎవరైనా బెల్టు షాపులు, నాటు సారా విక్రయిస్తుంటే 9440902585, 9177299067, 8328307774 నెంబర్లకు తెలియజేయాలని సీఐ తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది బాదుల్లా, తిక్కయ్య, సత్యనారాయణ ఉన్నారు.

డీఎస్సీ మోడల్ టెస్టుకు నమోదు చేసుకోండి

ఆత్మకూరు, మే 24(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 నోటిఫికేషన్ నేపథ్యంలో అభ్యర్థులను మరింత ప్రోత్సహించేలా పీఆర్‌టీయూ తరుపున డీఎస్సీ మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నామని, దరఖాస్తు చేసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాంపక్కిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ.. డీఎస్సీ మోడల్ టెస్ట్‌కు హాజరయ్యే అభ్యర్థులు తమను సంప్రదిస్తే పరీక్ష తేదీ, సమయం, పరీక్షా కేంద్రం వివరాలను తెలియపరుస్తామన్నారు. మరిన్ని వివరాలకకు 9908386729, 9052603003, 9700198488 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రమేశ్

పాములపాడు, మే 24(ఆంధ్రజ్యోతి): పాములపాడులో గ్రామీణ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడలను టీడీపీ నాయకుడు, బీఎస్ఎన్ఎల్, అడ్వైజరీ కమిటీ సభ్యుడు కురువ రమేశ్ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో క్రీడకారులలోని ప్రతిభను వెలికి తీసేందుకు ఈ క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. క్రీడకారులకు టీడీపీ తరుపున తమ వంతు సాయం అందిస్తున్నామన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఈ పోటీలు రెండు రోజులు పాటు జరుగుతాయని ఇందులో పాల్గొన దలచిన క్రీడకారులు రూ.300 రుసుము చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. మొదటి ఐదు బహుమతులు వరుసగా రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు అందించనున్నట్లు తెలిపారు. టీడీపీ నాయకులు, క్రీడకారులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి


పనిముట్లను పంపిణీ చేస్తున్న అసోసియేట్ డీన్ జయలక్ష్మి

మహానంది, మే 24 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి. జయలక్ష్మి తెలిపారు. శనివారం కళాశాల ఆవరణలో నంద్యాల జిల్లా దొర్నిపాడు మండలంలోని 200 మంది ఎస్సీ రైతులకు శనగపంట సాగులో సస్యరక్షణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాశాల డీన్ జయలక్ష్మి ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా రైతులకు కళాశాల శాస్త్రవేత్తలు వివిధ వాణిజ్య పంటల సాగులో తీసుకోవాల్సిన సలహాలతో తద్వారా పంట దిగుబడిపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు ఉచితంగా రూ. 16 లక్షల విలువైన వ్యవసాయ పనిముట్లతో పాటు నూతన శనగ విత్తనాలను కళాశాల డీన్ చేతుల మీదుగా పంపిణీ చేయించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ సుజాతమ్మ, కళాశాల శాస్త్రవేత్తలు తివిక్రమ్‌రెడ్డి, గురివిరెడ్డి, గీతా శిరీష, సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం

నంద్యాల కల్చరల్, మే 24(ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సహాయకులకు శనివారం మాయలూరి వెంకట్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. డీఆర్‌డీవో మాజీ చైర్మన్, ప్రభుత్వ రక్షణ రంగ ముఖ్య సలహాదారు డాక్టర్ సతీష్ రెడ్డి జన్మదినం సందర్భంగా అన్నదానం చేసినట్లు వెంకట్ తెలిపారు. లయన్ పెనల శ్రీకాంత్, విజయభాస్కర్, రామపుల్లయ్య, చిన్నరామపుల్లయ్య, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

ప్రభుత్వ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం


మహానందిలో క్షీరాభిషేకం చేస్తున్న రేషన్ డీలర్లు


గోస్పాడులో

గోస్పాడు, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రేషన్ ప్రక్రియను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తామని రేషన్ డీలర్లు అన్నారు. కూటమి ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను రద్దుచేసి రేషన్ డీలర్లకు యథాస్థానం కల్పించడంతో కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధుల పోస్టర్‌కు క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. మర్యాదపూర్వకంగా తహసీల్దార్ షేక్ మొహిద్దీన్‌ను కలిశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు పుల్లయ్య, బషీర్, పూర్ణచంద్రరావు, మధు, వెలుగొండారెడ్డి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహానంది: కూటమి ప్రభుత్వం రేషన్ డీలర్లకు గతంలో మాదిరి యథావిధిగా బాధ్యతలు అప్పచెప్పడంపై మహానంది మండల డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మహానంది మండల రెవెన్యూ కార్యాలయం ముందు కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధుల ఫ్లెక్సీలకు డీలర్లు బుక్కాపురం నారాయణ, సాయిలక్ష్మి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కూటమి ప్రభుత్వం తమ విన్నపం మేరకు రేషన్ వాహనాలను రద్దు చేసి రేషన్ దుకాణం వద్ద కార్డుదారులకు సరుకులు పంపిణీకి శ్రీకారం చుట్టడం మంచి నిర్ణయం తీసుకోవడంపై ఆనందించామని చెప్పారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసున్నారు.

నందీశ్వరుడికి ప్రదోషకాల పూజలు


మహానందిలో నందీశ్వరుడికి పూజలు చేస్తున్న వేదపండితులు

మహానంది, మే 24(ఆంధ్రజ్యోతి): వైశాఖ బహుళ త్రయోదశి మహాప్రదోషం పురస్కరించుకొని మహానంది క్షేత్రంలోని రాతి నందీశ్వరుడికి ప్రదోషకాల పూజలు, అభిషేకం వేదపండితులు ఘనంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం ప్రధాన ఆలయం ముందు భాగంలోని నందీశ్వరుడికి వేదపండితుడు రవిశంకర్ అవధాని ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ప్రదోషకాల పూజలను జరిపారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పసుపుల సుబ్బారెడ్డి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన ధార్మిక కార్యక్రమాలు


కలమందలపాడు గ్రామంలో గోపూజ చేస్తున్న భక్తులు

మిడుతూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలమందలపాడు గ్రామంలో గత నాలుగు రోజుల నుంచి శివాలయంలో టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకట రెడ్డి ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలు శనివారం ముగిశాయి. శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై తెలుగు కల్లం సాహితీ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చాన్నావుల వెంకట రెడ్డి సంగీత ఉపన్యాసాలు ఆలపించారు. ముగింపు సందర్భంగా శనివారం భక్తులు గోపూజ, కుంకుమార్చనలు నిర్వహించారు. తేజేశ్వరరెడ్డి, రామేశ్వరరెడ్డి, అర్చకులు మహేష్, వెంకటేశ్వర్లు భక్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి


మాట్లాడుతున్న సీఐ కృష్ణమూర్తి

నంద్యాల టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ముఖ్య అతిథులుగా హాజరైన ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డా.సురేఖ, సూపరిండెంట్ మల్లీశ్వరి, సీఐ కృష్ణమూర్తి అన్నారు. నంద్యాలలోని జిల్లా మద్యపానం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు.. నివారణ చర్యలపై సీఐ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎక్కువగా యువత మద్యపానం వంటి దురాలవాట్లకు బానిసలవుతు న్నారని, దీంతో వారి భవిష్యత్తు అంధకారంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

మురుగు ఇలా.. అడుగు పడేదెలా?



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

గడివేముల, మే 24 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని బూజనూరు గ్రామంలో బీసీ కాలనీలో వర్షపు నీరు సీసీ రోడ్డుపై నిలిచి మడుగును తలపిస్తోంది. వర్షపు నీరు వెళ్లడానికి కాలువలు లేకపోవడంతో నీరు రోడ్డుపై రోజులతరబడి నిలుస్తోంది. కాలనీవాసులు సీసీ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు సీసీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలో వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి సీసీ రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

థైరాయిడి జంకు

కర్నూలు హాస్పిటల్, మే 24 (ఆంధ్రజ్యోతి): జుట్టు రాలడం, బరువు తగ్గడం, ఇతర అనారోగ్యాలు, వంటి సమస్యలతో థైరాయిడ్ రోగులు భయపడిపోతున్నారు. ముఖ్యంగా ఇప్పుడు చాలా మంది మహిళల్లో వేధిస్తున్న సమస్య థైరాయిడ్. ఆహారం, వ్యాయామాల్లో కొన్ని మార్పులు చేసుకుంటే ఈ వ్యాధిని అరికట్టవచ్చునని వైద్యులు తెలియజేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 20 కోట్ల మంది థైరాయిడ్ వ్యాధితో బాధపడుతున్నారు. థైరాయిడ్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు 2007 మే 25వ తేదీన ప్రపంచ థైరాయిడ్ వ్యాధుల నివారణ-ప్రారంభ చికిత్స అన్న నినాదాన్ని ఇచ్చింది.

- ఆందోళనలో థైరాయిడ్ బాధితులు
- రోజురోజుకు పెరుగుతున్న కేసులు
- పురుషుల కంటే మహిళల్లో అధికం
- జీవనశైలి మార్పుతో నియంత్రించొచ్చు
- నేడు వరల్డ్ థైరాయిడ్ డే



అవయవాల పనితీరు మందగిస్తుంది..

మన శరీరంలో అన్నిభాగాలు సక్రమంగా పనిచేయాలంటే థైరాయిడ్ గ్రంథి పని తీరు బాగా ఉండాలి. ఈగ్రంథి పనితీరులో ఏమాత్రం తేడా కనిపించినా అవయవాల పనితీరు మందగిస్తుంది. శరీరంలో ఉన్న ముఖ్య గ్రంథుల్లో థైరాయిడ్ ఒకటి. ఇది శరీర ఎదుగుదలలో ప్రధానపాత్ర పోషిస్తుంది. అయితే ఈగ్రంథి పనితీరు గతి తప్పుతుంది. దీంతో హైపర్, హైపో థైరాయిడిజం, గాయిటల్ వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ గ్రంథి సమతుల్యత తప్పడంతో ఒక్కసారి థైరాయిడ్ క్యాన్సర్ బారిన పడుతారు.

లక్షణాలు:

- కొన్ని శారీరక లక్షణాలతో థైరాయిడ్‌ను గుర్తించవచ్చును. ఆకలి లేకపోవడం, బరువు పెరగడం, త్వరగా అలసిపోవడం, మలబద్ధకం, నెలసరి క్రమం తప్పడం, జుట్టు విపరీతంగా రాలడం, చర్మం పొడిగా మారడం, చలికి తట్టుకోలేక పోవడం వంటివి కనిపిస్తే దాన్ని హైపో థైరాయిడిజంగా గుర్తించాలి.
- సరిగానే తింటున్నా విపరీతంగా బరువు తగ్గడం, నిద్ర పట్టకపోవడం, చేతులు వణకడం, మానసిక ఒత్తిడి చల్లగా ఉన్న వేళల్లోనూ వేడిగా అనిపించడం, ఎక్కువగా చెమటలు పట్టడం, నెలసరి క్రమం తప్పడం ఎక్కువసార్లు మలవిసర్జనకు వెళ్లాల్సి రావడం ఈలక్షణాలు హైపర్ థైరాయిడిజంగా పరిగణించాలి.

మగవారిలో ఒకరికి వస్తే..

పురుషుల్లో కంటే మహిళల్లో అధికంగా కనిపించే హైపర్ థైరాయిడిజం మగవారిలో ఒక్కరికి వస్తే ఆడవారిలో ఏడు మందికి వచ్చే అవకాశాలున్నాయి. మహిళల్లో దాదాపు 4రెట్లు థైరాయిడ్ ఎక్కువగా వస్తుంది. థైరాయిడ్ సమస్యలతో బాధపడే గర్భిణులు జాగ్రత్తగా ఉండటం ఎంతో అవసరం. హైపోథైరాయిడిజం, థైరాక్సిన్ హార్మోన్ లోపిస్తే గర్భస్రావం అయ్యే ముప్పు ఎక్కువ. మన దేశంలో గర్భిణుల్లో హైపో థైరాయిడిజం సమస్యలు అధికంగా ఉండటం వల్ల ప్రతి గర్భిణీ తప్పకుండా థైరాయిడ్ పరీక్ష చేసుకోవాలి.

హార్మోన్లు అసమతుల్యత వల్ల..

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎండో క్రైనాలజీ విభాగానికి హార్మోన్ల అసమతుల్యత వల్ల థైరాయిడ్ సమస్యలతో రోగులు వస్తుంటారు. ఎండోక్రైనాలజీ విభాగంలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఓపీ ఉంటుంది. ఈ విభాగానికి 700 మంది రోగులు వస్తుండగా.. ఇందులో థైరాయిడ్ రోగులు 200 మంది వస్తుంటారు. మిగిలిన విభాగాల్లో మరో 200మంది థైరాయిడ్‌తో చికిత్స పొందుతుంటారు. మొత్తం థైరా యిడ్ రోగుల్లో 70 శాతం మందికి హైపోథైరాయిడ్, 30శాతం మందికి హైపర్ థైరాయిడ్ బాధితులు ఉంటున్నారు. ఎండోక్రైనాలజీ విభాగంలో థైరాయిడ్ సమస్యకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ముఖ్యంగా గర్భిణులకు థైరాయిడ్ పరీక్షలు తప్పనిసరిగా చేస్తున్నారు.

పరీక్షలు తప్పనిసరి



థైరాయిడ్ రావడానికి శరీరంలోని హార్మోన్ స్థాయిలో తేడాలే కారణం. కర్నూలు జీజీహెచ్‌కు ఎండోక్రైనాలజీ విభాగానికి వారానికి 200 మంది థైరాయిడ్ బాధితులు వస్తుంటారు. ఎండోక్రైనాలజీ డిపార్టుమెంటుతో పాటు గైనిక్, సర్జరీ, మెడిసిన్ వార్డులకు కూడా రోగులు వస్తుంటారు. థైరాయిడ్ జబ్బులున్న వారు తప్ప కుండా పరీక్షలు చేయించుకొని రెగ్యులర్‌గా మందులు వాడాలి.

- డా.పి.శ్రీనివాసులు, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, ఎండోక్రైనాలజీ విభాగం, జీజీహెచ్, కర్నూలు

థైరాయిడ్‌ను అదుపులో ఉంచుకోవాలి



థైరాయిడ్‌ను అదుపులో ఉంచుకోవాలి. కనీసం ఆరు నెలలకొకసారి వైద్యపరీక్షలు చేయించుకోవాలి. వైద్యులు సూచించిన ప్రకారం రెగ్యులర్‌గా మందులు వాడాలి. జీవనశైలి మార్పులతో వ్యాధిని నియంత్రించవచ్చు. ఆహారంలో అయోడిన్ లోపం లేకుండా చూసుకోవడం కొంత వరకు థైరాయిడ్ బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

- డా.బి.భరత్, ఎండోక్రైనాలజిస్టు, కర్నూలు

మహిళల్లో ఎక్కువ



పురుషుల కన్నా మహిళల్లో థైరాయిడ్ వచ్చే అవకాశం ఎక్కువ. థైరాయిడ్ గ్రంథిలో కణితులు 1 సెంటీమీటర్ కన్నా ఎక్కువగా ఉంటే ఆపరేషన్ నిర్వహిస్తారు. మగవారిలో థైరాయిడ్ గడ్డలు ఉంటే ఎక్కువ శాతం క్యాన్సర్ గడ్డలు వచ్చే ప్రమాదం ఉంది. కణితి వున్న వారికి ఆపరేషన్ అవసరం లేదు.

- డా.భార్గవ వ్యాస్, జనరల్ సర్జన్, ల్యాప్రోస్కోపిక్ సర్జన్, మెడికవర్ హాస్పిటల్, కర్నూలు

మహానాడుకు వేలాదిగా తరలిరండి

- జిల్లా సత్తా చాటుదాం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



కర్నూలు అర్బన్, మే 24(ఆంధ్రజ్యోతి): మహానాడుకు వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరిగే మహానాడుకు జిల్లా నుంచి 5వేల మంది నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. మహానాడు వేదికలో కర్నూలు జిల్లాలో చంద్రబాబు నాయకత్వ బలాన్ని నిరూపించే దిశగా అందరూ తరలిరావాలని పేర్కొన్నారు. నియోజకవర్గాల్లో, జిల్లాలో జరిగిన మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

జగన్‌కు జైలు తప్పదు

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు అర్బన్, మే 24(ఆంధ్రజ్యోతి): తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రజాధనాన్ని దోచిన ఆర్థిక నేరగాడు జగన్‌కు జైలు తప్పదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.44 వేల కోట్ల ప్రజాధనాన్ని దోచిన నేరంలో కేసుల్లో బెయిల్‌పై బయట ఉన్న జగన్మోహన్‌రెడ్డికి పదేళ్ల పాటు జైలులో చిప్పకూడు తప్పదని అన్నారు. ఈడీ, ఆటాచ్ చేయగా జైలకు వెళ్లి వచ్చాక ఆయన కల్లబొల్లి మాటలకు ప్రజలు నమ్మి ఓట్లు వేసి గెలిపించారని అన్నారు. ఆదే ఓటర్లు 2024 ఎన్నికల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గుణపాఠం చెప్పారని అన్నారు.

విద్యుదాఘాతంలో యవకుడు మృతి

గోనెగండ్ల, మే 24(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలం చిన్నమరివీడు గ్రామంలో కరెంట్ బల్బు అమర్చుతూ ప్రమాదవశాత్తు ఇంటి యజమాని రవి(26) విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు సీఐ విజయభాస్కర్ శనివారం తెలిపాడు. గ్రామానికి చెందిన రవి కొత్తగా ఇల్లు కట్టుకున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటి పైకప్పు వేశారు. కొత్తగా నిర్మించుకున్న ఇంట్లో విద్యుత్ బల్బు ఏర్పాటు చేయడానికి వెళ్లినప్పుడు ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్ రవి కాలికి, చేతికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై రవి అక్కడి కక్కడే మృతి చెందాడు. రవి భార్య రోజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాగవైష్ణవిజయం

- పోరాడి గెలచిన పేదింటి సరస్వతీ పుత్రిక
- గణితంలో రీవెరిఫికేషన్
- ఏకంగా పెరిగిన 15 మార్కులు
- అవుకు మండల టాపర్‌గా నాగవైష్ణవి
- అభినందించిన ఉపాధ్యాయులు



రీవెరిఫికేషన్‌లో పెరిగిన మార్కుల పత్రాన్ని చూపుతున్న విద్యార్థిని నాగవైష్ణవి

అవుకు, మే 24 (ఆంధ్రజ్యోతి): మార్కులు తక్కువ వచ్చాయని ఆమె బాధ పడలేదు.. పిరికి చర్యలు చేపట్టలేదు.. మనోధైర్యం, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగింది.. రీవెరిఫికేషన్‌కు సిద్ధమైంది.. అందులో భాగంగా గణితం రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసి ఏకంగా 15 మార్కులను పొందింది. అవుకు మండల టాపర్‌గా సరస్వతీ పుత్రిక నాగవైష్ణవి నిలిచింది.

నాడు 569 మార్కులు.. నేడు 584..

నాగవైష్ణవి పేద కుటుంబంలో జన్మించింది. తండ్రి లారీ డ్రైవర్‌గా, తల్లి కూలీ పనులకు వెళుతున్నా కూతురికి చదువుపై ఉన్న ఆసక్తితో కష్టపడి చదివించారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేకుండా నాగవైష్ణవి క్రమశిక్షణతో చదివింది. ఏప్రిల్ నెల 23న వెలువడిన ఫలితాల్లో 569 మార్కులొచ్చాయి. దీంతో పాఠశాల ఫస్ట్‌కే పరి మితమైంది. మండల టాపర్‌గా రావలసి ఉన్న అవకాశాన్ని కోల్పోయింది. గణితంలో మంచిపట్టు ఉన్నప్పటికీ 84మార్కులు రావటంతో ఖంగుతింది. రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకుంది. ఈనెల 23వ తేదీ రాత్రి వెలువడిన రీవెరిఫికేషన్ ఫలితాల్లో గణతం సబ్జెక్ట్‌లో ఏకాంగా 15 మార్కులు పెరిగి 99 మార్కులు వచ్చాయి. మొత్తం 584 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల నుంచి మండల టాపర్‌గా నిలిచిందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చెన్నకేశ్వరీ ధ్రువీకరించారు. ప్రభుత్వం విడుదల చేసిన పెరిగిన మార్కుల ధ్రువీకరణ పత్రాన్ని విద్యార్థిని నాగవైష్ణవికి అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు విజయలక్ష్మీ, లీలాభారతి, సుమలత, మంజుల, రాధిక, సుబ్బలక్ష్మీ, లత, విజయకుమారి, భాస్కర్ విద్యార్థినిని అభినందించారు.

హైకోర్టు బెంచ్ ఎందుకు పెట్టలేదు?

- రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి



సమావేశంలో మాట్లాడుతున్న తెలకపల్లి రవి

కర్నూలు కల్చరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో హైకోర్టు బెంచ్ ఇంతవరకూ ఎందుకు ఏర్పాటు చేయలేదని సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షుడు, రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కవులు, కార్టూనిస్టులు, పాత్రికేయులు ఏమి రాసినా సహించలేని లక్షణం పెరిగిపోతోందని, అది ఆమోదించలేని పరిణామమని అన్నారు. భావ ప్రకటన, విమర్శనాత్మక స్వచ్ఛ మీద దాడి ఆందోళన కలిగించే విషయమన్నారు. కర్నూలులో కవి వెంకటేశ్వర్లు కవిత రాస్తే పోలీసులు నిర్బంధించడం సరికాదన్నారు. కర్నూలుకు ప్రకటించిన న్యాయ విశ్వ విద్యాలయం వేరేచోట పెట్టాలని నిర్ణయించారని, ఇలా ఈ ప్రాంతంపై నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. దీన్నివల్ల ప్రాంతీయ అసమానతలు ఏర్పడతాయన్నారు. గతంలో జరిగిన రాయలసీమ ఉద్యమం గుర్తు పెట్టుకోవాలని చెప్పారు. బనకచర్ల ప్రైవేటు ప్రాజెక్టు అనడం ఏమిటని, విద్య, వైద్యం, రోడ్లు ఇలా అన్నీ ప్రైవేటీకరణ చేసి ఇప్పుడు ప్రాజెక్టులు కూడా ప్రైవేటీకరణ చేస్తే ఏమవుందని ప్రశ్నించారు. కడపలో ఉన్న ఏపీజీబీ అమరావతికి తీసుకెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఈ అంశాలపై సాహితీ స్రవంతి కృషి చేస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్మరణీయుల జాబితాను సవరించాలని, గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం పంతులు, గిడుగు రామ్మూర్తి పేర్లను ఆ జాబితాలో చేర్చాలని రాష్ట్రంలో ఆంగ్ల మాధ్యమం ఎవరూ వద్దనడం లేదని, తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. రంగస్థల కళలు, షార్ట్‌ఫిలిమ్స్‌లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆడిటోరియాలను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎంపీ బసవరాజు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆవుల బసప్ప, చక్రపాణి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బొలెరో వాహనాన్ని ఢీకొన్న లారీ

ఆదోని రూరల్, మే 24 ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం ఇస్వీ ప్రధాన రహదారిలో బొలెరో వాహనాన్ని లారీ ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకొంది. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలు తగిలాయి. బళ్లారి జిల్లా మోకా తాలుక ఎరంగలి గ్రామానికి చెందిన రుద్రప్ప తన కుటుంబ సభ్యులు దాదాపు 15మందితో కలిసి కె.ఈ 46 ఎమ్ 1899 గల బొలేరా వాహనంలో మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం శనివారం బయల్దేరారు. వీరి వాహనం ఇస్వీ సమీపానికి రాగానే కోవెలకుంట్లకు చెందిన లారీ ఢీకొనడంతో రుద్రప్ప, స్థానిక హంపమ్మతోపాటు మరోకరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ఏరియానుపత్రికి తరలించారు. ఇస్వీ పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

నేడు హెల్త్ అసిస్టెంట్ల కౌన్సెలింగ్

కర్నూలు హాస్పిటల్, మే 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో మాత్రమే హెల్త్ అసిస్టెంట్ల(మేల్) కౌన్సెలింగ్ జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ శనివారం ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో వెక్టార్ బర్న్ డిసీజ్ కింద (ఎన్‌వైబీడీసీపీ) డెంగీ, మలేరియా వ్యాధుల నియంత్రణకు హెల్త్ అసిస్టెంట్ల సేవలను వినియోగించనున్నారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లాలో కౌన్సెలింగ్ పూర్తి కావడంతో కర్నూలు జిల్లాలో మాత్రమే కౌన్సెలింగ్ పూర్తిచేసి మధ్యాహ్నం 12 గంటలలోపు వివరాలను పంపాలని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఫోన్‌లో ఆదేశించినట్లు తెలిపారు. డేట్ ఆఫ్ జాయినింగ్ ప్రకారమే ఈ నిర్వహించాలని సూచించారు.

చిన్నారిపై అత్యాచారం హేయం

ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



చిన్నారి మృతదేహంపై పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే

చాగలమర్రి, మే 24 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో ఓ చిన్నారి అత్యాచారానికి గురి కావడం బాధాకరమని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అన్నారు. శనివారం జరిగిన ఈ ఘటనలో వివరాలు తెలుసు కోవడానికి ఎమ్మెల్యే గ్రామానికి చేరుకొని చిన్నారి మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు మనోధైర్యం ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని, సమాజంలో ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడే వ్యక్తులకు ఉరితీయాలని అన్నారు. ఈ విషయం గురించి అసెంబ్లీలో కూడా చర్చిస్తామని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిందితుడిని కఠినంగా శిక్షించేలా చూస్తామని అన్నారు.

టోల్‌గేట్ సిబ్బందిపై దాడి

మహానంది, మే 24 (ఆంధ్రజ్యోతి): టోల్‌గేట్ రుసుం అడిగినందుకు సిబ్బందిపై దాడిచేసి గాయపర్చిన సంఘటన శుక్రవారం మహానందిలో చోటుచేసుకొంది. ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపిన వివరాలివీ.. మహానంది దేవస్థానంకు చెందిన టోల్‌గేట్ల నిర్వహణను కాంట్రాక్ట్ పద్ధతిలో బహిరంగ వేలంలో ఒక కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అక్కడ కాంట్రాక్టర్ ఏర్పాటు చేసుకొన్న శ్రీనివాసగౌడ్ అనే సిబ్బంది నంద్యాల నుంచి మహానందికి వస్తున్న కారును ఆపి టోల్‌గేట్ రుసుం చెల్లించాలని అడిగారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కారు డ్రైవర్ నేనెవరో నీకు తెలియదా? నన్నే టోల్‌గేట్ చెల్లించాలని అడుగుతావా? అని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇంతటితో ఆగకుండా శ్రీనివాసగౌడ్‌పై కారు డ్రైవర్ దాదిచేసి తీవ్రంగా గాయపర్చాడు. దీనిపై గాయపడ్డ సిబ్బంది శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. ఇదిలా ఉండగా కారులో ఇటీవల నంద్యాల జిల్లాలోని ఒక పోలీస్ స్టేషన్‌లో పని చేస్తూ సస్పెండ్ అయిన ఎస్‌ఐ ప్రయాణిస్తున్నట్లు సమాచారం. ఆయన అండతోనే కారు డ్రైవర్ రెచ్చి పోయి టోల్‌గేట్ సిబ్బందిపై దాడికి ప్రయత్నించి గాయపర్చినట్లు తెలిసింది. ఈ వ్యవహారం నంద్యాల జిల్లా వ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది.

పత్తి ఓబులయ్యకు 'ఎన్టీఆర్ పురస్కారం'

నేడు పల్నాడు జిల్లా సాతులూరులో ప్రదానం



కర్నూలు కల్చరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్యకు 'ఎన్టీఆర్ పురస్కారం' లభించింది. నటరత్న ఎన్టీఆర్ జాతీయస్థాయి నాటక పోటీల సందర్భంగా ఈ పురస్కారం అందజేస్తున్నట్లు కన్వీనర్ నడింపల్లి నరసింహారావు తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు పల్నాడు జిల్లా సాతు లూరులో జరుగుతున్న 'ఎన్టీఆర్ జాతీయ స్థాయి నాటక పోటీల సందర్భంగా పత్తి ఓబులయ్యకు ఎన్టీఆర్ పురస్కారం అందజేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, నరసరావు పేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. పత్తి ఓబులయ్యకు ఎన్టీఆర్ పురస్కారం లభించడంపై జిల్లాలోని వివిధ కళాసంస్థల ప్రతినిధులు, సాహిత్య సంస్థల నిర్వాహకులు హర్షం వ్యక్తంచేశారు.

అప్పుల బాధతో మహిళా రైతు బలవన్మరణం

సంజామల, మే 24: అప్పుల బాధతో ఓ మహిళా రైతు విషద్రావణం తాగి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన ఆకుమళ్లలో చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన ఒంగూరు స్వప్న(41) భర్త పుల్లారెడ్డి గతేడాది మృతిచెందాడు. ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేది. అప్పులు ఎక్కువ కావడంతో తనకున్న ఆరు ఎకరాలను గత ఏడాది అమ్మేసింది. మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుంది. అందులో మిరప, మొక్కజొన్న పంటలు సాగుచేసి నష్టాల పాలైంది. అప్పులు ఎలా తీర్చాలో మదనపడేది. ఏమిచేయాలో తెలియక శుక్రవారం రాత్రి ఆమె విషద్రావణం తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. వాంతులు చేసుకుంటుండగా కుటుంబ సభ్యులు గమనించి కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కుమారుడు తరుణ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేషన్ దుకాణాల నుంచే సరుకుల పంపిణీ

- డీఎస్‌వో రాజా రఘువీర్

కర్నూలు కలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి): జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ దుకాణాల నుంచే సరుకుల పంపిణీ జరుగుతుందని కర్నూలు డీఎస్‌వో రాజారఘువీర్ తెలిపారు. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీలోపు రేషన్ దుకాణాల్లో నిత్యావసర సరుకులు పొందవచ్చని ఆయన కార్డుదారులకు సూచించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు రేషన్ దుకాణాలు పని చేస్తాయన్నారు. 65 సంవత్సరాలు పైబడిన వారు, విభిన్న ప్రతిభావంతులు వారికి సరుకులు డోర్ డెలివరీ ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

మోహన్‌ప్రసాద్‌కు డాక్టరేట్

హంద్రీనీవా నదిపై పరిశోధన



కర్నూలు అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి): జియోస్పెషియల్ సాంకేతికలతో హంద్రీ నది పరివాహక ప్రాంతంపై పరిశోధనకు డాక్టరేట్ మోహన్‌ప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం(ఎస్వీయూ) తిరుపతి భూగర్భశాస్త్రం విభాగంలో ప్రొఫెసర్ టి.మధు పర్యవేక్షణలో ఇంటిగ్రేటెడ్ హైడ్రోజియోలాజిక్ స్టడీస్ ఆఫ్ హంద్రీ రివర్ బేసిన్ యూజింగ్ జియోస్పేషిల్ టెక్నిక్స్ ఇండియాలో ఈ అధ్యయనం పూర్తిచేశారు. కర్నూలు జిల్లాలోని హంద్రీ నదిపరివాహక ప్రాంతంలోని భూభౌతిక లక్షణాలను, భూగర్భ జలవనరులను గుర్తించేందుకు జియోస్పెషియల్ టెక్నాలజీలను సమర్థవంతంగా వినియోగించారు. డాక్టరేట్ ప్రదానంపై డాక్టర్ బి.రాజమాణిక్యం, పరీక్షల నియంత్రణాధికారి అధికారికంగా ఉత్తర్వులు జారీచేశారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ వీరభద్రుడు

చాగలమర్రి, మే 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహించొద్దని ఎంపీపీ వీరభద్రుడు సూచించారు. శనివారం మండల కార్యాలయంలో ఆయా సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల ముత్యాలపాడు గ్రామంలో సచివాలయం-1లో ఉద్యోగులు గైర్హాజరయ్యారు. సమయపాలన ఏది అన్న శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో తాహిర్‌హుసేన్, కార్యదర్శులు పాల్గొన్నారు.

వెండి పానిమట్టం వితరణ



కన్యకాపరమేశ్వరి ఆలయంలో వెండి పానిమట్టం అందిస్తున్న దాతలు

చాగలమర్రి, మే 24 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి దాతలు బి.రామకృష్ణ దంపతులు వెండిపానిమట్టం(లింగపీఠం) వితరణ చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వెండిపానిమట్టం వితరణ చేసిన దాతలను ఆలయ కమిటీ సభ్యులు అభినందిస్తూ సన్మానించారు. కార్యక్ర మంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి నవతా ప్రసాద్, ధర్మకర్త లక్ష్మణబాబు, ఆర్యవైశ్యులు మల్లికార్జున, రవికుమార్, రఘురామ్ పాల్గొన్నారు.

ఆదర్శ విద్యార్థికి అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డు



సంధ్యకు అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డు అందిస్తున్న డీఈవో

రుద్రవరం, మే 24 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం ఆదర్శ పాఠశాల విద్యార్థినికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డు వచ్చింది. శనివారం నంద్యాలలో జిల్లా విద్యాధికారి జనార్దన్‌రెడ్డి విద్యార్థిని సంధ్యారాణికి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు అభినందించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో వేయికి 945 మార్కులు సాధించడంతో అవార్డు వచ్చిందన్నారు.

'ప్రజలపై భారం మోపడం దారుణం'

డోన్ టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు మరిచి ప్రజలపై భారాలు మోపడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ అన్నారు. శనివారం స్థానిక కొండపేటలోని పార్టీ కార్యాలయంలో సీపీఎం పట్టణ నాయకులు టి.శివరాం అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 సంవత్సరాలకు సంబంధించి పట్టణాల్లో ఇంటి పన్ను 20 శాతం పెంచుతూ గుట్టు చప్పుడు కాకుండా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. జీవోను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. నాయకులు జి.కొండయ్య, ఏవీ భాస్కర్ రెడ్డి, బి.నాగమద్దయ్య, చిన్న రెహిమాన్, ధనుంజయగౌడు పాల్గొన్నారు.

కౌలు కార్డులతో లాభాలు : ఏవో

కొలిమిగుండ్ల, మే 24 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులు ప్రత్యేక కౌలు గుర్తింపు కార్డు పొందడంతో అనేక లాభాలు ఉంటాయని వ్యవసాయ శాఖ మండల అధికారి భూమా జ్యోతి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ మండలంలోని కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పాలుట్ల రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు

బేతంచెర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూటుపల్లి గ్రామసమీపంలో ప్రకృతి కొండల నడుమ వెలసిన పాలుట్ల రంగనాథ స్వామికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. డోన్ పట్టణానికి చెందిన సారంగస్వామి, కమల్ కిషోర్, పద్మావతి, వెంకటేశ్‌లతో పాటు మరో 11మంది పాదయాత్రగా ఆలయానికి చేరుకుని స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అ నంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

వైసీపీ పట్టణ యూత్ అధ్యక్షుడిగా వంశీకృష్ణ

డోన్ టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పట్టణ యూత్ అధ్య క్షుడిగా పూజారి వంశీకృష్ణను, యూత్ ప్రెసిడెంటుగా బుగ్గన జయ చంద్రారెడ్డిని వైసీపీ రాష్ట్ర అధిష్టానం ఎంపిక చేసింది. ఈ సందర్భం గా ఎన్నికైన పూజారి వంశీకృష్ణ, బుగ్గన జయచంద్రారెడ్డి మాట్లాడు తూ తమ ఎంపికకు సహకరించిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలి పారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం వీరి కి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

చిన్నారిపై అత్యాచారం దారుణం

చాగలమర్రి, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలికపై అత్యాచారం చేయడం దారుణమని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. శనివారం గ్రామంలో చిన్నారి మృతదేహం వద్ద సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన మాట్లాడుతూ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని తక్షణమే ఉరి తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరభద్రుడు, వైసీపీ నాయకులు తదితరులున్నారు.

ముందస్తు వర్షాలతో..

సాగుకు సన్నద్ధం

- పొలం పనుల్లో అన్నదాతలు బిజీ బిజీ

డోన్ రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): ముందస్తు వర్షాలతో ఖరీఫ్ సీజన్‌కు రైతులు సన్నద్ధమవుతున్నారు. జూన్ మొదటి వారంలో మొదలయ్యే ఖరీఫ్ సీజన్ ముందస్తు వర్షాలతో పది రోజుల ముందే ప్రారంభించారు. డోన్ మండలంలో 25,200 హెక్టార్ల వ్యవసాయ భూమి ఉంది. వర్షాధారంపై ఆధారపడిన రైతులు కంది పంట సాగుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దాదాపు 13వేల హెక్టార్లలో పంట సాగు చేసేందుకు సంసిద్ధమవుతున్నారు. అలాగే వేరుశనగ, మొక్కజొన్న, ఆముదం, సజ్జలు, కొర్రలు వంటి పంటలు సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే తమ పొలాల్లో ఉన్న పిచ్చిమొక్కలను, రాళ్లను తొలగించడం వంటి పనులు చేస్తున్నారు. కొందరు ఎద్దులతో, మరికొందరు ట్రాక్టర్లతో పొలాలను దున్నుకుంటున్నారు.



కొత్తపల్లి గ్రామ సమీపంలో ట్రాక్టర్ ద్వారా పొలాన్ని దున్నుతున్న రైతన్న

పెసర, మినుములు వేసుకోవాలి



ఖరీఫ్ సీజన్ జూన్ మొదటి వారంలో మొదలవుతుంది. ప్రస్తుతం రైతులు భూమిని సారవంతం చేసుకునేందుకు పెసర్లు, మినుములు వంటి పంటలు వేసుకోవాలి. పొలాన్ని దున్ని దుక్కి పెట్టుకున్న రైతులు జూన్ మొదటి వారంలో విత్తనాలు వేసుకోవచ్చు.

- అబ్దుల్ షఫీ, వ్యవసాయాధికారి, డోన్



నాగులవరంలో మిరప మొక్కలు నాటుతున్న కూలీలు

రుద్రవరం మండలంలో..

రుద్రవరం: మండలంలోని ఆలమూరు, నరసాపురం, చిత్రరేణిపల్లె, నాగులవరం గ్రామాల్లో ముందస్తు వంద ఎకరాల్లో వ్యవసాయ బోరుబావుల కింద మిరప పంటను సాగు చేశారు. ఇటీవల వరుసగా వర్షాలు కురవడంతో భూమి పదను అయింది. దాంతో ముందస్తు సాగులో రైతులు నిమగ్నమయ్యారు.

ముందుగా సాగు చేస్తే బాగుంటుంది



వ్యవసాయ బోరుబావి కింద ముందస్తుగా మూడెకరాల్లో మిరప మొక్కలు నాటించా. ముందు సాగుచేస్తే పంట దిగుబడి బాగుంటుందని ఆశతో సాగు చేస్తున్నా. ఉష్ణోగ్రత నమోదవుతున్న భూతల్లి సహకరిస్తుందన్న ధైర్యంతో సాగు చేస్తున్నా.

- వెంకట సుబ్బనరసయ్య, రైతు, నాగులవరం

ఆశతో సాగు చేశా



ఎండలు దంచికొడుతున్నా పుడమి తల్లిని నమ్ముకుని రెండు ఎకరాల్లో మిరప మొక్కలు నాటించాం. ముందస్తు పచ్చిమిర్చికి రేటు ఉంటుందనే ఆశతో సాగు చేశా.

- బాషా, రైతు,ఆలమూరు

మల్లికార్జున స్వామి ఆలయానికి మహర్దశ

- రూ.1.96 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం

బేతంచెర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల-డోన్ రహదారిలో హెచ్.కొట్టాల గ్రామ సమీపంలో ప్రకృతి కొండల నడుమ వెలసిన ప్రముఖ శైవ క్షేత్రమైన ముచ్చట్ల భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాస్థానానికి మహర్దశ వచ్చింది. పురాతన ప్రముఖ శైవ క్షేత్రమైన ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయం మండలంలోనే ప్రసిద్ధి చెందింది. గతంలో ఆలయానికి భక్తులు రావడానికి కూడా చాలా ఇబ్బంది పడేవారు. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి రోడ్డు సౌకర్యం కల్పించడంతో భక్తుల రాకపోకలు సాగుతున్నాయి. ఎలాంటి అభివృద్ధి పనులు ఆలయంలో ఇప్పటి వరకు జరగలేదు. భక్తులు తిరగడానికి బండలు కూడా సరిగ్గా లేవు. గాలిగోపురం సైతం శిథిలావస్థకు చేరుకుంది. ఇదే విషయాన్ని గత మార్చిలో ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ప్రస్తుతం ఆలయ అభివృద్ధికి రూ.1.96 కోట్లతో మంజూరు అయ్యాయి. దాంతో భక్తులకు సౌకర్యార్థం ఉండేందుకు శుభకార్యాలు జరుపుకునేందుకు మండపం, ఆలయంలో బండ పరుపు, గాలిగోపురం మరమ్మతులు చేసేందుకు పనులు ప్రారంభించారు. అదేవిధంగా దేవాదాయ శాఖ అధికారులు ఆలయ ప్రాంగణంలో కోనేరు నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉందని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ప్రారంభమైన కల్యాణ మండప నిర్మాణ పనులు

రైతులు ఉద్యమించాలి

- సిద్ధేశ్వరం బహిరంగసభను విజయవంతం చేయండి
- రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి

కోవెలకుంట్ల, మే 24 (ఆంధ్రజ్యోతి) : రాయలసీమ రతనాల సీమ కావాలంటే సిద్ధేశ్వరం వద్ద అలుగు నిర్మించాలని, అందుకు రైతులందరూ కలిసికట్టుగా ఉద్యమించాలని రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి కోరారు. శనివారం పట్టణంలో విశ్రాంత గ్రంథాలయ అధికారి పల్లె నరసింహారెడ్డితో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 31న సిద్ధేశ్వరం వద్ద నిర్వహించనున్న బహిరంగసభ విజయవంతం చేయాలని కోరారు. మండల పరిధిలోని పొట్టిపాడు గ్రామానికి చేరుకుని శివాలయం వద్ద గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. రైతులను బహిరంగసభకు ఆహ్వానించారు. కార్యక్రమంలో నరహరి, భాస్కర్‌రెడ్డి, వీరభద్రారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సుదర్శనరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

'సిద్ధేశ్వరం' ఆందోళనకు సీపీఐ సంపూర్ణ మద్దతు

డోన్ టౌన్: సిద్ధేశ్వరం అలుగు ప్రాజెక్టు కోసం జరిగే ఆందోళనకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే.రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు అన్నారు. శనివారం స్థానిక నక్కిరామన్న భవన్‌లో వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాకముందు వ్యవసాయ భూముల గురించి, సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడుతారు తప్ప అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి గురించి మాట్లాడరని ఆరోపించారు. గుండ్రేవుల, అలగనూరు రిజర్వాయర్, గోరుకల్లు రిజర్వాయర్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఉమ్మడి జిల్లాలో హంద్రీనీవా ప్రాజెక్టు ను పూర్తి చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పోలవరం ప్రాజెక్టు నుంచి బనకచర్ల ద్వారా రాయలసీమకు నీళ్ల ఇస్తామని చెప్పడం ఇక్కడి ప్రజలను మోసం చేయడమే అని అన్నారు. కృష్ణా జలాల బోర్డును రాయలసీమలో ఏర్పాటు చేయాలని, హంద్రీనీవా ప్రాజెక్టు స్థిరీకరణకు కృషి చేయాలన్నారు. గోదావరి, కృష్ణా, పెన్నా నదుల అనుసంధానం గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని ఎస్.రంగనాయుడు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుంకయ్య, రాధాకృష్ణ, బి.నారాయణ, పులిశేఖర్, ఎన్‌కే రామ్మోహన్, ఎం.పుల్లయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దశరథరామిరెడ్డి

బైక్ నుంచి కిందపడి వ్యక్తి మృతి

చాగలమర్రి, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద బోధనం గ్రామానికి చెందిన సుబ్బరాయుడు, (32) మోటార్ బైక్ నుంచి కిందపడి శనివారం మృతి చెందాడు. పెద్దబోదనం నుంచి ఆళ్లగడ్డకు వెళ్తుండగా ద్విచక్రవాహనంతో డివైడర్‌ను ఢీకొని బోల్తాపడిన సంఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. సుబ్బరాయుడు కొలిమి పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

నేడు ఆళ్లగడ్డలో నిరసన ర్యాలీ

ఆళ్లగడ్డ, మే 24 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బిల్లు సవరణకు నిరసనగా పట్టణంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఖాజీ మహ్మద్ జాఫర్ సాదిక్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆల్‌ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆదేశాల మే రకు స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం వద్ద నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ముస్లింలు పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వానికి డీలర్ల కృతజ్ఞతలు

సంజామల, మే 24(ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువుల పంపిణీ చౌక దుకాణాల డీలర్లకే అప్పగించడం హర్షణీయమని ప్రభుత్వానికి డీలర్లు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల డీలర్లు పాల్గొన్నారు.

మహానాడు విజయవంతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ మే 24(ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో నిర్వహించ నున్న మహా నాడు కార్యక్రమాన్ని విజ య వంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. శని వారం ఆళ్లగడ్డలోని కేవీ సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాలలో తెలుగు దేశం పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జిలతో ఎమ్మెల్యే సమా వే శం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పరిశీలకుడు అమర్‌నాథ్‌రెడ్డి హాజర య్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 27,28,29 తేదీల్లో నిర్వహించనున్న మహానాడు పండగకు ఆళ్లగడ్డ నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు. మహానాడుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. నాయకులు భార్గవ్‌రామ్, వివిధ మండలాల క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

చదువు చెప్పించే బాధ్యత మాది

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సుబ్బారాయుడు కుమార్తెల చదువు బాధ్యత తాము చూసుకుంటామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సుబ్బారాయుడు కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. టీడీపీ నాయకుడు టీఎన్‌ఎల్ పుల్లయ్య విజ్ఞప్తి మేరకు బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

రోడ్డుపైనే మురుగు నీరు

- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

డోన్ టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిగురమానుపేట మసీదు సమీపంలో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత మున్సిపల్ అధికారులు డ్రైనేజీలో పూడిక తీయించకపోవడంతో మురుగునీరు రోడ్డుపై పారుతోంది. సంబంధిత అధికారులు స్పందించి కాలువల్లో పూడికను పారిశుధ్య కార్మికులతో తీయించాలని కోరుతున్నారు. ఓ పక్క ప్రభుత్వం పారిశుధ్య పనులు చేపట్టాలని, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఓ పక్క స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటనలు ఇస్తున్నా కార్యారూపం దాల్చడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీలను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.



చిగురుమాను పేట రహదారిలో నిలిచిన మురుగు

కల్వర్టులు లేక ఇబ్బందులు



డ్రైనేజీపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బండలు

డోన్ రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామ ప్రధాన రోడ్డులో ఉన్న డ్రైనేజీలపై కల్వర్టులు లేకపో వడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరు నెలల క్రితం గ్రామంలోని ప్రధాన రోడ్డులో డ్రైనేజీలను నిర్మించారు. కల్వర్టులు ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీలపై తాత్కాలికంగా బండలు వేసి రాకపోకలు సాగిస్తున్నారు. అయితే.. మోటారు బైకులు, ఆటోలు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. డ్రైనేజీలపై కల్వర్టులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

నిర్లక్ష్యం వీడండి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావు

ఉయ్యాలవాడ, మే 24 (ఆంధ్రజ్యోతి) : సర్వేలపై నిర్లక్ష్యం వీడి పని చేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావు ఆదేశించారు. శనివారం తుడుములదిన్నె గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న యోగాంధ్ర, వితౌట్ చిల్డ్రన్ ఆధార్, విత్ బర్త్ చిల్డ్రన్ ఆధార్ సర్వేలను పకడ్బందీగా చేయాలన్నారు. మండలంలో 26,896 గృహాలుండగా, ఇప్పటి వరకు 20043 గృహాలను సర్వే చేశామన్నారు. అలాగే 232 మందిని యోగాంధ్రకు రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆయన తెలిపారు. సర్వేలపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

ఉయ్యాలవాడ, మే 24 (ఆంధ్రజ్యోతి) : డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దారు శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ పంపిణీని పక్కాగా నిర్వహించాలన్నారు. తూకాల్లో తేడాలు రావద్దని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు ప్రసాద్‌బాబు, ఆర్ఐ అంకన్న, వీఆర్వోలు ఉన్నారు.

రుద్రవరం: మండలంలో వచ్చే1నుంచి చౌక దుకాణాల్లోనే రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దారు మల్లిఖార్జునరావు అన్నారు. శనివారం రెవెన్యూ కార్యాలయంలో చౌకదుకాణం డీలర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ 65 ఏళ్లు నిండిన వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దకు వెళ్లి రేషన్ పంపిణీ చేయాలని సూచించారు. సమావేశంలో డీటీ చంద్రశేఖరయ్య, డీలర్లు పాల్గొన్నారు.

మండలానికి దాణా మంజూరు

ఉయ్యాలవాడ, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండలానికి 10.5 మెట్రిక్ టన్నుల సమీకృత దాణా మంజూరైనట్లు మండల పశువైద్యాధికారి నాగశైలజ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ పశువుల దాణా మండలానికి చేరుకుంది. 50శాతం సబ్సిడీతో పాడి రైతులకు దాణా అందిస్తామన్నారు. రైతులు భారత్ పశుదాణా యాప్‌లో రిజిస్టార్ కావాలన్నారు. తెల్లరేషన్ కార్డు ఉండి, పశువులకు టీకాలు వేయించిన వారు మాత్రమే అర్హులన్నారు. 50 కేజీల దాణా ప్యాకెట్ పూర్తి ధర రూ.1110 కాగా, రాయితీపై కేవలం రూ.555కు మాత్రమే ఇస్తామన్నారు. దాణాకు కావాల్సిన రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాల వద్ద కానీ, పశు వైద్యశాల కేంద్రం వద్ద కానీ సంప్రదించాలని ఆమె తెలిపారు.

ఆవాజ్ కమిటీ చేయూత

డోన్ టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తారకరామ నగర్‌కు చెందిన చిరు వ్యాపారిగా ఉంటూ జీవనం సాగిస్తున్న అక్బర్ బాషా కూతురు వివాహానికి తమ వంతు సాయంగా ఆవాజ్ కమిటీ నాయకులు శనివారం ఆర్థిక సాయాన్ని అంద జేశారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ నాయకులు ఎస్ఏ చిన్న రెహిమాన్, షాదిక్ బిల్డర్, షమీం బేగం, జలదుర్గం రసూల్, జహీద్, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ కుమార్, సీఐటీయూ, యూటీఎఫ్, ఐద్వా నాయకులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కోర్సుకు శిక్షణ

బనగానపల్లె, మే 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కోర్సుకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ లలిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కోర్సుకు ఏదైనా డిగ్రీ లేదా బీటెక్ లేదా కంప్యూటర్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్నవారు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. వివరాలకు సెల్ 9705998056 నంబరును సంప్రదించాలని ఆమె కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌కేపీ హై స్కూల్ దగ్గర నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున పాతబస్టాండు ఎస్‌కేపీ స్కూల్, రైల్వేస్టేషన్ రోడ్డు, షాదీఖానా, సుందర్‌సింగ్ కాలనీ, డీఎస్పీ కార్యాలయం ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

వైభవంగా చెన్నకేశవ పల్లకీ ఉత్సవం



చెన్నకేశవ, సంజీవరాయ ఉత్సవమూర్తుల ఊరేగింపు

చాగలమర్రి, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, సంజీవరాయ ఉత్సవమూర్తుల పల్లకీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం వేదపండితుల ఆధ్వర్యంలో చెన్నకేశవ ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం చేశారు. కార్యక్రమంలో ఈవో వెంకటరమణ, నారాయణరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

రుద్రవరం, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురం, రుద్రవరం గ్రామాల్లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అమ్మవార్లకు అభిషేకం నిర్వహించారు. వాసాపురంలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.